క్లుప్తంగా

నకిలీ మద్యం సీసాల స్వాధీనం

కాకినాడ క్రైం: నకిలీ మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలతో నగరానికి చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసినట్టు త్రీటౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. వారి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని సూర్యనారాయణపురానికి చెందిన భాషా, రామకృష్ణ గత కొద్ది నెలలుగా హైదరాబాద్ నుంచి ఖాళీ విదేశీ మద్యం సీసాలు సేకరించి తీసుకువచ్చి అందులో స్థానిక మద్యాన్ని నింపి అమ్ముతున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీ నిర్వహించి 46 ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్టు చేశారు.

భాస్కర్ సేవలు ఆదర్శవంతం



భాస్కరరావు దంపతులను సత్కరించిన ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కరప: ఎందరో విద్యార్థులకు మార్గదర్శకులుగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు జీబీ భాస్కరావు సేవలు అందరికీ ఆదర్శవంతమని ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ అన్నారు. నడకుదురులోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయుడు భాస్కరరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా శనివారం నడకుదురులో ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో కలిసి భాస్కరరావు దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఉపాధ్యాయవృత్తిలో అంకితభావంతో పనిచేసిన సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. వివిధ ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ, భద్రతే ధ్యేయం

కాకినాడ క్రైం: రక్షణ, భద్రతే ధ్యేయంగా ముందడుగు వేయాలని మహిళలు నినదించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఈ సమావేశంలో పాల్గొని మహిళా భద్రత ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ఎస్పీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐసీడీఎస్ విభాగం నుంచి మహిళా సిబ్బంది, పోలీస్ శాఖలో పని చేస్తున్న మహిళలు పాల్గొన్నారు. భానుగుడి కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పాటయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు వినికిడి పరీక్షలు

కాకినాడ: ఈ నెల 3వ తేదీన ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా వాగ్దేవి స్పీచ్, హియరింగ్ క్లినిక్ ప్రతినిధులు ట్రాఫిక్ పోలీసులకు శనివారం ఉచిత వికికిడి పరీక్షలు నిర్వహించారు. సుమారు 75 మందికి పరీక్షలు చేసినట్టు అడియాలాజిస్ట్, పేతాలజిస్ట్ డాక్టర్ రేణుక తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్‌లో విధులు నిర్వహించే పోలీసులు శబ్ద కాలుష్యం బారిన పడడం వల్ల వినికిడి శక్తి తగ్గిపోయే ప్రమాదం వీరిలో అధికంగా ఉంటుందన్నారు. అందువల్లే వీరికి తమ సిబ్బందితో కలిసి ఉచితంగా పరీక్షలు నిర్వహించామన్నారు. మార్చి మొదటి వారం అంతా ఉచితంగా తమ క్లినిక్ లో వినికిడి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

నెలాఖరుకు పన్ను వసూళ్ల లక్ష్యం పూర్తి చేయాలి

బోట్‌క్లబ్: పన్నుల వసూలు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు శ్రద్ధగా పని చేసి ఈ నెలాఖరు నాటికి అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. సూచించారు. ఈ నెలాఖరు నాటికి మొండిబకాయిల వసూల కోసం డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. పన్నుల వసూలు విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలాఖరు నాటికి పన్నులన్నీ వసూలు చేయాలన్నారు. పన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి పన్నులు చెల్లించని మొండి బకాయిదారుల ఇళ్ల వద్ద కుళాయిలను కనెక్షన్‌ను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి

కాకినాడ సిటీ: అమరవీరుల స్ఫూర్తితో నిరంతరం ప్రజా సేవ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ పిలుపునిచ్చారు. శనివారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించినట్టు తెలిపారు. సుందరయ్యభవన్‌లో అమరవీరుల సంస్మరణ సభకె.సత్తిరాజు అధ్యక్షతన నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీ రాణి, ఎం.రాజశేఖర్, సీహెచ్ రమణి, సీహెచ్ రాజ్‌కుమార్‌లతోపాటు సీనియర్ నాయకులు కర్రి నాగేశ్వరరావు తదితరులు అమరవీరుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, సిహెచ్ వేణు, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, సతీష్, రమణ, వర్మ, కె.వీరబాబు, సూర్య, నాగలక్ష్మి, యు.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగరం చెత్తమయం

- అధ్వానంగా మురుగునీటి వ్యవస్థ
- దుర్వాసన మధ్య ప్రజల జీవనం
- పట్టించుకోని అధికారులు
- ఐటీ స్మార్ట్‌సిటీలో దుస్థితి

బోట్‌క్లబ్: పెన్షన్ ప్యారడైజ్‌గా పేరొందిన కాకినాడ నగరంలో మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఏ వీధి చూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. డ్రైనేజీలు పొంగి పొర్లిపోతూ కంపు కొడుతున్నాయి. రెండు నెలల కావస్తున్నా డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించలేదు. నిత్యం ప్రజలు దుర్వాసన మధ్యే జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

విధులకు హాజరుకాని సిబ్బంది

కాకినాడ నగరపాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది తమ ఇష్టానుసారంగా విధులకు హాజరు కావడంతో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు చాలా అధ్వానంగా తయారయ్యాయి. పాలకవర్గం ఉంటే కౌన్సిల్ సమావేశంలో తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళితే వెంటనే వాటికి పరిష్కారం లభించేది. కాకినాడ నగరపాలక సంస్థ పాలకవర్గం ఎన్నికల నిర్వహించకపోవడంతో ప్రస్తుతం పారిశుధ్య సిబ్బంది తమ విధులకు సక్రమంగా హాజరు కాకుండానే తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా కచేరి పేట

జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న వీధి కచేరి పేట అక్కడ ప్రస్తుతం డ్రైనేజీలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త, సిల్టు గత రెండు నెలలుగా తీయకపోవడంతో మురుగునీరు బయటకు పోయే అవకాశం లేకుండా పోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు పోయేందుకు వీలు లేక రహదారుల పైనే వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో ఈ మురుగు నీటిలోనే ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించారు. ప్రస్తుతం వర్షం లేకపోయినా ఇంటిలోని మురుగనీరు డ్రైనేజీల్లో నుంచి రోడ్లపైకి వస్తుంది. అయినప్పటికీ సిబ్బంది ఈ వీధుల వైపు తొంగి చూడడంలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు దోమలతో నిత్యం అవస్థలు పడుతున్నారు. చీకటి పడితే గుంపులుగా దోమలు ఇళ్లల్లో చేరుతున్నాయని దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొందని ఈ ప్రాంత మహిళలు వాపోతున్నారు.

సమస్యలు విన్నవించినా..

కార్పొరేషన్ అధికారులకు ఫోన్లో ఆయా ప్రాంతాల సమస్యలు విన్నవించుకున్నా వారు పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కచేరి పేటలోని ఒకవీధిలో డ్రైనేజీ ఆక్రమించుకొని ఒక వ్యక్తి నిర్మాణం చేస్తున్న కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు కారణంగా డ్రైనేజీలో మురుగునీరు ప్రవహించడం లేదు.

దోమల నివారణ చర్యలేవీ

గతంలో దోమల విజృంభించకుండా కార్పొరేషన్ అధికారులు ఫాగింగ్ యంత్రాల ద్వారా కనీసం వారంలో ఒక్కరోజైనా డ్రైనేజీల వద్ద ఫాగింగ్ చేసేవారు రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేయడం వల్ల దోమలు అదుపులో ఉండేవి. దీంతో హాయిగా నిద్రపోయే వాళ్లమని ప్రస్తుతం ఫాగింగ్ యంత్రాలు కనీసం వీధుల్లో కూడా రావడం లేదని అసలు ఆ యంత్రాలు ఉన్నాయో లేదో తెలియదని స్థానికులు మండి పడుతున్నారు.



కచేలిపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పారిశుధ్య సిబ్బందిపై కొరవడినా కొరదా

కాకినాడ నగరంలో సుమారు వెయ్యి మందికిపైగా రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. ప్రతి రోజు ఈ సిబ్బంది నగరంలో వారికి కేటాయించిన వీధుల్లో రోడ్లు శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో పేరొకొనిపోయిన చెత్తాచెదారం, సిల్ట్ తీయాల్సి ఉంది. కార్పొరేషన్ పాలక వర్గం ఉంటే ఆ డివిజన్ కార్పొరేటర్ ప్రతి రోజు సిబ్బంది ఎలా పనిచేస్తున్నారో తనిఖీ చేసేవారు. ప్రస్తుతం పాలక వర్గం లేకపోవడంతో సిబ్బంది తూతూమంత్రంగానే విధులకు హాజరవుతున్నారే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది సక్రమంగా విధులు రాకుండా మస్తర్లు వేసుకొంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజు విధులకు హాజరయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కచేరిపేటలో ఓ వీధిలో డ్రైనేజీ ఆక్రమించి నిర్మాణం చేసిన దృశ్యం

దుర్వాసనతో ఇబ్బందులు



డ్రైనేజీలు నుంచి వస్తున్న దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత రెండు నెలలుగా ఈ ప్రాంతంలో డ్రైనేజీలు శుభ్రం చేయలేదు. దీంతో కొంపు కొడుతున్నా ముక్కు మూసుకొని ఈ రహదారులపై ప్రయాణించాల్సి వస్తోంది.

– కె.వీరబాబు

దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలి



మా కచేరి పేటలో రాత్రి సమయంలో దోమలు చాలా ఇబ్బంది పెడుతున్నాయి. ఏదొక పనిమీద తలుపులు తెరిస్తే చాలు దోమలు గుంపులు ,గుంపులుగా లోపలకు వస్తున్నాయి. దోమలు చనిపోయేందుకు ఆల్‌అవుట్ వినియోగిస్తున్నా పెద్ద ఉపయోగం లేదు. అధికారులు దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి.

– వి.శ్రీరామ్ విపిన్‌కుమార్

లయన్స్ సేవలు మరింత విస్తృతం



బాదం బాలకృష్ణ, విశ్వేశ్వరరావు, సూర్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

బాలాజీచెరువు: సమాజ సేవ చేయడానికి లయన్స్‌క్లబ్‌లు మంచి వేదికగా నిలుస్తాయని, వాటి సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రామారావు పేట లయన్స్‌హాల్లో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రామసుబ్రహ్మణ్యం, ఉమ్మడి తూర్పు గోదావరి లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో బాదం బాలకృష్ణ, కుసుమ, మంజులూరి విశ్వేశ్వరరావు, వేలూరి సూర్యనారాయణ దంపతులను శనివారం సాయంత్రం సత్కరించారు. క్లబ్ సభ్యత్వాలు పెంపుదలతో పాటు సేవా కార్యక్రమాలు అధికంగా నిర్వహించడం వల్ల సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించే లయన్ వార్షిక సమ్మేళనంకు సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఉప గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, పద్మతులసి, దంగేటి సతీష్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

21 ఏళ్లు నిండితేనే వివాహం

కాకినాడ రూరల్: అమ్మాయిలు 21 సంవత్సరాలు నిండితేనే వివాహం చేసుకోవాలని, బాల్య వివాహాలు నిర్మూలన కొరుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వారోత్సవాలలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ర్యాలీ నిర్వహించినట్టు సీడీపీఓ లక్ష్మి తెలిపారు. అమ్మాయిలకు 21సంవత్సరాలు నిండిన తరువాత వివాహాలు చేయాలని ఆమె కోరారు. బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మార్తమ్మ, పద్మశ్రీ, సింహాచలం, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధర్నాతో దిగొచ్చిన అధికారులు

కరప: గ్రామంలో అనుమతిలేని రొయ్యల చెరువుల తవ్వకాన్ని నిరసిస్తూ రైతులు ధర్నా చేయడంతో ఎట్టకేలకు అధికారులు దిగివచ్చారు. రైతుల ఇబ్బందులు వివరిస్తూ వారు చేసిన ధర్నా కార్యక్రమాన్ని సాక్షి దిన పత్రికలో 'రొయ్యల చెరువులు తొలగించండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనం పాఠకులకు విదితమే. కలెక్టర్ షన్మోహన్ స్పందించి కరపలోని రొయ్యల చెరువులను పరిశీలించి, నివేదిక ఇవ్వాలని జిల్లా మత్స్యశాఖాధికారి (జేఎఫ్‌ఓ) కె.కరుణాకరరావును ఆదేశించారు. దీంతో జేఎఫ్‌ఓ కరుణాకరరావు, ఎఫ్‌డీఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఆర్‌ఐ పవన్, ఇరిగేషన్ ఏఈఈ ఎన్.నాగభవానీ, వీఆర్వో కె.గణపతిరావు రైతులతో కలిసి తవ్విన చెరువులను పరిశీలించారు. రొయ్యల చెరువుల సాగుకు అనుమతిస్తే వాటి ద్వారా వచ్చే వ్యర్థాలతో సాగునీరు కలుషితమై, పంటలు పండమని రైతులు అధికారులకు వివరించారు. తమ ఇబ్బందులను గుర్తించి రొయ్యల చెరువులకు అనుమతులు ఇవ్వొద్దని కరప, కొరిపల్లి, పాతర్లగడ్డ తదితర గ్రామాల రైతులు కోరారు. అలాగే ఆక్వాజోన్ పరిధిలో ఉన్న తమ భూములను నిబంధన మేరకే రొయ్యల చెరువులు తవ్వించామని చెరువులకు సంబంధించిన భూమి యజమానులు తమ బాధలను అధికారులకు వివరించారు. చెరువులను పూర్తిగా పరిశీలించి, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని జేఎఫ్‌ఓ కరుణాకరరావు తెలిపారు.



కరపలోని చెరువులను రైతులతో కలిసి పరిశీలిస్తున్న జేఎఫ్‌ఓ కరుణాకరరావు తదితరులు

సామాజిక తనిఖీలపై శిక్షణ

కాకినాడ రూరల్: పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల భద్రత తదితర 6 అంశాలకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించడం ద్వారా పాఠశాల పనితీరు అంచనా వేసేందుకు వీలవుతుందని ఇందుకు ప్రధాన ఉపాధ్యాయులు సహకరించాలని కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు కోరారు. సాల్ట్(సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్) పోగ్రామ్‌లో భాగంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సామాజిక తనిఖీలకు ప్రధానోపాధ్యాయులకు రమణయ్యపేట ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షణ నిర్వహించారు. జిల్లాలోని 101 క్లస్టర్లలోని 1280 ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి 13వ తేదీ వరకూ సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. శిక్షణలో క్లస్టరు పాఠశాలల సీఆర్‌ఎంటీలు, ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్షా ఏఎస్‌ఓ జోగిరెడ్డి, ఏపీఎస్పీ హైస్కూల్ హెచ్‌ఎం గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

కరప: వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శనివారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా మొదటిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 93 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 10 మంది గైర్హాజరవ్వగా, 83 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు, డిపార్టమెంటల్ ఆఫీసర్ జెస్సీ డేనియల్ ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి, పర్యవేక్షించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా కరప ఎస్‌ఐ టి.సునీత, ఏఎస్‌ఐలు వి.సూరిబాబు, శ్రీనివాస్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.



వేళంగిలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

గత డిసెంబర్‌తో గుర్రపుడెక్క తొలగింపు పనులు పూర్తి చేశాం

- రబీలో తొలగింపు, క్రాస్‌బండ్స్ కోసం ప్రతిపాదనలు పంపాం
- డీఈఈ శేషగిరిరావు

సాక్షి ఇంపాక్ట్

కరప: గతేడాది డిసెంబరుతో మురగు కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు పనులు పూర్తిచేశామని, ఈ రబీలో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు క్రాస్‌బండ్స్, గుర్రపుడెక్క తొలగింపు పనులకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు కలెక్టర్ షన్మోహన్‌కు పంపించారు. ఈ విషయాన్ని ముగుగునీటి పారుదలశాఖ కాకినాడ సబ్ డివిజన్ డీఈఈ జి.శేషగిరిరావు శనివారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. కరప మండలంలోని తుల్యభాగ డ్రైన్, యండమూరు, శహపురం, కూరాడ, పాతర్లగడ్డ, వెంకటప్పయ్య, జి.భావారం, రాజు డ్రైన్లలో అడవిలా పెరిగిపోయిన గుర్రపు డెక్కతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, మురుగుకాలువ దుస్థితిని వివరిస్తూ సాక్షి దినపత్రికలో గతనెల 24వ తేదీన 'పెంట కాలువలు' పెరిగిన గుర్రపుడెక్క, అన్నదాతలకు తప్పని కష్టాలు' శీర్షికన ప్రచురితమైన కథనం పాఠకులకు విదితమే. దీనిపై డ్రెయినేజీశాఖ డీఈఈ స్పందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ద్వారా మేజర్, మీడియం డ్రెయిన్లలో 2024 జూలై నుంచి 2024 డిసెంబరు వరకు కాంట్రాక్టర్‌కు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం గుర్రపుడెక్క తొలగింపు పనులు చేయించామన్నారు. కరప మండల పరిధిలోని వివిధ డ్రెయిన్లలో రబీలో క్రాస్‌బండ్స్ నిర్మించేందుకు, గుర్రపుడెక్క తొలగింపునకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరుకు కలెక్టర్ అంగీకరించారని, నిధులు మంజూరుకా గానే పనులు చేయిస్తామని డీఈఈ శేషగిరిరావు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సీఏడీఏ(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈపనులను కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల పర్యవేక్షణలో జరుగుతాయని డీఈఈ వివరించారు.

స్వామిత్వ సర్వే వేగవంతంగా నిర్వహించాలి

కరప: గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే వేగవంతంగా నిర్వహించాలని కాకినాడ డీఎల్‌పీఓ టి.అన్నామణి ఆదేశించారు. మండల పర్యటనలో భాగంగా శనివారం ఆమె పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాల్లో పర్యటించి స్వామిత్వ సర్వే ప్రక్రియను పరిశీలించి, పంచాయతీ, సచివాలయం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇంటియజమాని సమక్షంలో సర్వే నిర్వహించి, సరిహద్దులు గుర్తించి సర్వే చేసి, గృహ యజమానులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహణలో భాగంగా గ్రామాల్లో తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలిచ్చాలన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైన్లలో పూడికతీయించి, మురుగునీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను డీఎల్‌పీఓ అన్నామణి పరిశీలించి, వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి, విక్రయించడం ద్వారా పంచాయతీల ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. తర్వాత ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డ, కొంగోడు తదితర గ్రామాల్లో పర్యటించారు.



పెద్దాపురప్పాడులో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

చిరునవ్వుతో మానసిక స్థితి మెరుగు

బోట్‌క్లబ్: ఒక సాధారణ చిరునవ్వు మానసిక స్థితిని మెరుగుపర్చుతుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న సత్య దంత వైద్యశాలలో శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ×షేర్ ఏ స్మైల్ డే× సందర్భంగా దంతాల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యకరమైన దంత ఆరోగ్యంతో విశ్వాసంతో కూడిన చిరునవ్వు సాధ్యమని, అందుకే ప్రతి ఒక్కరూ నోటి శుభ్రతపై శ్రద్ధ చూపాలని కోరారు. నవ్వడం వల్ల భావోద్వేగ ప్రయోజనాలు మాత్రమే కాకుండా చాలా ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయన్నారు. రక్తపోటు, ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుందని, ఓర్పును పెంచుతుంది, రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుందన్నారు. నవ్వడం వల్ల రోగనిరోధక వ్యవస్థ కూడా బలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఏఎస్ మూర్తి, నాగేంద్ర, శ్రీవల్లి, పద్మావతి ప్రజలు పాల్గొన్నారు.



దంత సంరక్షణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్డాల సత్యనారాయణ.

కరప మండలంలో 92.55 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలో శనివారం సాయంత్రానికి 92.55 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛనుదారులు 11,275 మంది ఉండగా రూ.4,82,25,500 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,435 మంది లబ్ధిదారులకు రూ.4,44,46,500 గ్రామసచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితరులు లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చారన్నారు. గొర్రిపూడి-2 గ్రామ సచివాలయం 96.15 శాతం, ఉప్పలంక సచివాలయం 94.92 శాతం, పెనుగుదురు-2 సచివాలయం 94.44 శాతం, గురజనాపల్లి సచివాలయం 94.37 శాతంతో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శుల పర్యవేక్షణలో లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్‌సొమ్ములు అందజేశారన్నారు. ఆలస్యమైనా మొదటి రోజు 98 శాతం పూర్తి చేయమని చెప్పామన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం ధర్నా

కాకినాడ సిటీ: అభివృద్ధి పేరుతో అప్పులు చేసి ప్రజలపై భారాలు వేయవద్దని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం కాకినాడలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో అత్యంత భారీ బడ్జెట్ ప్రవేశపెట్టారని, అయితే ఎన్నికల హామీల అమలకు తగిన విధంగా కేటాయింపులు లేవన్నారు. అభివృద్ధి పేరుతో కోట్లు అప్పులు తీసుకు వచ్చి ప్రజలపై భారాలు వేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ఉపాధి కల్పనకు బడ్జెట్లో కేటాయింపులు పెంచాలన్నారు. తక్షణమే నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. నగర సీపీఎం నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల గురించి బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, ఏ సూరి శ్రీనివాస్, శంకర్, వీరబాబు, తలుపులమ్మ, భూలక్ష్మి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.




బడ్జెట్‌కు నిరసనగా ధర్నా చేస్తున్న దృశ్యం

సామూహిక సీమంతాలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట దండుపుంతలో గర్భిణులకు సామూహిక సీమంతాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గిడుతూరి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పాల్గొని సీమంతాలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీను, అనిల్, సత్యనారాయణ, సందీప్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ మేళా



అరట్లకట్ట పాఠశాలలో సైన్స్ మేళాలో నమూనాలను పరిశీలిస్తున్న తల్లిదండ్రులు

కరప: అరట్లకట్టలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రెండో రోజు కూడా సైన్స్ మేళా నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ మేళాను రెండు రోజులు నిర్వహించినట్టు హెచ్‌ఎం ఎస్.విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు డి.సురేష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు సైన్స్‌పై పట్టు అవగాహన కలిప్పించి, ఆసక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సైన్స్ మేళాకు వచ్చిన తల్లిదండ్రులకు విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలను చూపించి, వాటి గురించి వివరించారు.


బడ్జెట్‌లో బీసీలకు ఎటువంటి ప్రాధాన్యం లేదు



అల్లి రాజబాబు యాదవ్

కాకినాడ: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు ఏటువంటి ప్రాధాన్యత లేదని చంద్రబాబు కూటమి ప్రభుత్వం బీసీలకు మరొక్కసారి వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, బీసీ జేఏసీ కన్వీనర్ అల్లి రాజబాబు యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్, రక్షణ చట్టం ఏర్పాటు, బీసీ కుల వృత్తుల వారికి ఆదరణ పథకం పునరుద్ధరణ, చదువుకున్న నిరుద్యోగులకు ఆర్థిక చేయూత, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలు ఇచ్చిందన్నారు. గత తొమ్మిది నెలలగా ఏ ఒక్కటి పట్టించుకోకపోగా ఇప్పుడు బడ్జెట్లో ఈ విషయాలపై ఎటువంటి కేటాయింపులు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం మరొకసారి బీసీలను వెన్నుపోటు పొడిచినట్టు పేర్కొన్నారు. కులం, మతం, కుటుంబం, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే విద్య ఒకటే ఏకైక మార్గమని నమ్మి అమలు చేసిన నాయకులు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వీరు అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, విద్య దీవెన, వసతి దీవెన, ఇంగ్లిష్ మీడియం స్కూల్స్, నాడు-నేడులో స్కూల్స్ ఆధునికరించి, జీఆర్ఈ, టోఫెల్ తదితర అంతర్జాతీయ విధానాలను ప్రవేశపెట్టి బీసీ, బడుగు, బలహీన వర్గాల పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. 2024 ఎన్నికలలో 'బాబు' ఇస్తానన్న సూపర్ సిక్స్‌లో ఒకటైన తల్లికి వందనం నిధులు కేటాయింపు చూస్తే రూ.13,113 కోట్లు అవసరమైతే బడ్జెట్‌లో కేటాయించినది రూ.9,407 కోట్లు. అంటే నాలుగోవంతు మంది చదువుకునే పిల్లలకు మొండి చేయి చూపే ఉద్దేశంలో ఉన్నారని తెలుస్తోందని పేర్కొన్నారు.

'రంగరాయ'లో హౌస్‌సర్జన్ల ఇంటర్న్‌షిప్



బీఎల్‌ఎస్ ప్రక్రియపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కాకినాడ క్రైం: పరిపూర్ణమైన వైద్యుడిగా అవతరించేందుకు హౌస్ సర్జన్సీ ఆయువు పట్టు అని రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అన్నారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోని ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో 2020 బ్యాచ్ హౌస్‌సర్జన్ల ఇంటర్న్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈయూ కోఆర్డినేటర్ పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి, ఫిజియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నజియా ఫరాహ్‌లు విద్యార్థులకు ఆసుపత్రిలో రోగులకు ఎలా సేవలు అందించాలో వివరించారు. నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్ తర్వాత చేసే హౌస్‌సర్జన్సీలో రోగులతో మమేమకమవుతారన్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్, కౌన్సిలింగ్ ప్రక్రియలతో పాటు రోగులు వారి బంధువులతో నడుచుకునే తీరు, వివిధ ఆరోగ్య సమస్యలను గుర్తించే విధానం, మందులు, పరీక్షల నిర్వహణలతో పాటు రోగులకు వైద్య సేవలు అందించే ప్రక్రియలో భాగంగా అవసరమయ్యే ప్రతి అంశంపైనా అవగాహన కల్పించారు. అనంతరం జీజీహెచ్‌లో స్కిల్ ల్యాబ్‌కు విద్యార్థులు వెళ్లారు. అక్కడ అనస్థీషియా నిపుణుడు డాక్టర్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో సీపీఆర్‌లోని బేసిక్ కార్డియోపల్మనరీ లైఫ్ సపోర్ట్(బీఎల్‌ఎస్) ప్రక్రియపై శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పని చేద్దాం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతానికి కార్యకర్తలందరూ కలసికట్టుగా పని చేయాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పిఠాపురం మండలం చిత్రాడలో ఈ నెల 14వ తేదీన పార్టీ ఆవిర్భావ సభ నిర్వహిస్తున్న సందర్భంగా పార్టీ ముఖ్య నేతలతో కాకినాడలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభ కోసం కాకినాడలో ఈ నెల 8న కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై విమర్శలు చేశారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.